క్లుప్తంగా

పాలకొండలో వర్షం



పట్టణ పరిసరాల్లో గాలులతో కూడిన వర్షం

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం రోజంతా వర్షం కురిసింది. వర్షం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మరో రెండు రోజులు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ వర్షం వరి పంటకు ఎంతో మేలు చేస్తుందని అన్నదాతలు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో గ్రామీణ వైద్య సిబ్బంది గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సుజేయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న మందులు, ఓపీ విభాగం, రోజువారీ నివేదికలపై చర్చించారు. ముఖ్యంగా మలేరియా, డయేరియా, వైరల్ జ్వరాలు అదుపు చేసేందుకు ప్రజలను చైతన్యపర్చాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వృద్ధులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని స్పష్టం చేశారు.

ఎయిడెడ్ పాఠశాలలు పునఃప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ లేక మూతపడిన మండలంలోని దుమ్మంగి, బొద్దిడి, పి.ఆమిటి గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పునః ప్రారంభమ య్యాయి. ఆయా పాఠశాలలను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభంతో ఈ గ్రామాల విద్యార్థులకు ఉన్న ఊరిలోనే ప్రాథమిక విద్య అందుతుందన్నారు.ఎంఈఓ బి.చంద్రశేఖర్, కూటమి నాయకులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

భామిని: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థినులు కృష్ణవేణి, మోహినీ, ఇలియానాలను ప్రిన్సిపాల్ జి. గంగాదేవి, పీఈటీలు సింహాచలం.మల్లికార్జునరెడ్డి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల చీరాలలో జరిగిన సౌత్ జోన్ డిస్ట్రిక్ట్ లెవిల్ సెలక్షన్‌లో విద్యార్థులు రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ గంగాదేవి తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

భామిని: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని బత్తిలి ఎస్సై జి.అప్పారావు అన్నారు. ఏబీ రోడ్డులో బత్తిలి వద్ద బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. మద్యం మత్తులో ఎటువంటి పరిస్థితుల్లో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో సమగ్ర సమాచారం

పాలకొండ రూరల్: సమాచార హక్కు చట్టంతో అధికారిక కార్యకలాపాలకు సంబంధించిన సమగ్ర సమాచారం పొందవచ్చని మండలంలోని బాసూరు పీఏసీఎస్ సంఘ సీఈఓ కె.బంగారునాయుడు అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సమాచార చట్టం ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘ సీఈఓ బీవీ రామారావు, సహాయ ఎగ్జిక్యూటివ్ పి.సాయికుమార్, మజ్జి జగన్‌మోహనరావు, తదితరులు, పాల్గొన్నారు.

క్రీడోత్సాహం..

పాలకొండ రూరల్: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఎంఈఓ కె.సోంబాబు పర్యవేక్షణలో మండల పరిధిలోని 59 పాఠశాల్లో వ్యాసరచన, వక్తృత్వ, జానపద నృత్య, నాటక, పద్య విభాగాలతో పాటు కబడ్డీ, ఖోఖో, టాగ్ ఆఫ్ వార్, మ్యూజిల్ చైర్, వాలీబాల్, క్రికెట్, తదితర పోటీలు జోరుగా సాగుతున్నాయి. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందించనున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ హరగోపాల్ నేతృత్వంలో వివిధ క్రీడాపోటీల్లో ఔత్సాహికులు పోటీ పడ్డారు.

అభినందన సభ

వీరఘట్టం: అటవీశాఖలో వీరఘట్టం సెక్షన్ డిప్యూటీ రేంజర్‌గా రవిబాబు అందించిన సేవలు శ్లాఘనీయమని జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన అన్నారు. ఉద్యోగోన్నతిపై అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌కు రేంజర్‌గా వెళుతున్న రవిబాబును మండల కేంద్రంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ ప్రసూన మాట్లాడుతూ.. నర్సరీల ఏర్పాటుతో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించి రవిబాబు అందరి మన్ననలు పొందారన్నారు.

కార్యక్రమంలో పాలకొండ రేంజర్ రామారావు, సిబ్బంది, స్థానిక వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

భయం.. భయం..

- ఏనుగుల ప్రభావంతో బిక్కుబిక్కుమంటున్న రైతులు
- పంటలు ఏమవుతాయోనని ఆందోళన చెందుతున్న గిరిజనులు
- ప్రతి ఏటా తప్పని నష్టం



మన్యంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)

సీతంపేట: గిరిజనులు ఆరుగాలం శ్రమించి పండిస్తున్న ఖరీఫ్, రబీ పంటలు ఏనుగుల పాలవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గిరిజనులు ఖరీఫ్ సీజన్‌లో వరి, రాగులు, తదితర పంటలు వేయడానికి భయపడుతున్నారు. నియోజకవర్గంలోని సీతంపేట, భామిని మండలాల్లో ఎక్కువగా ఏనుగులు సంచరిస్తుంటాయి. ప్రస్తుతానికి కురుపాం మండలం వైపు వెళ్లినా ఎప్పుడు తిరిగి వచ్చేస్తాయేమోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. పదిహేనేళ్లగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల పరిధిలో వరినాట్లు వేయడానికి గిరిజనులు వెనక్కి తగ్గుతున్నారు. పంట దిగుబడి వచ్చే సమయానికి ఏనుగులు కుమ్మేయడంతో పంట మొత్తం పోతోందని.. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందని గిరిజనులు చెబుతున్నారు. రెండు మండలాల్లో వందల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. అలాగే రాగులు మరో వంద ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఐటీడీఏ చిరుధాన్యాల పంటలను కూడా ప్రోత్సాహించడానికి చర్యలు తీసుకుంది. ఇటీవల కందులు, రాగులు వంటి విత్తనాలను కూడా సరఫరా చేసింది. అయితే ఇప్పుడు ఈ పంటలన్నీ ఏమవుతాయోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏనుగుల పుణ్యమా అని సుమారు 50 ఎకరాల వరకు వరి పంట నాశనమవుతోంది. వరితో పాటు చెరుకు, రాగుల పంటలు కూడా నాశనమవుతున్నాయి. సీతంపేట ఏజెన్సీలో పులిపుట్టి, హడ్డుబంగి, చిన్నబగ్గ, కొండాడ పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ఎక్కువగా ఏనుగులు సంచరిస్తుంటాయి. కె.గుమ్మడ, మెట్టుగూడ, జామితోట, ముకుందాపురం, ఇప్పగూడ, మోహన్‌కాలనీ, జామితోట, బూర్జగూడ, వెంపలగూడ, తదితర గ్రామాలో ఏనుగుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.



గతంలో వరి పంట నష్టపోయామని చెబుతున్న మోహన్‌కాలనీ వాసులు (ఫైల్)

ఉద్యానవన పంటలకూ నష్టమే..

ఉద్యానవన పంటలను ఈ సీజన్‌లో కొండపోడులో వేస్తారు. ఐటీడీఏ పరిధిలో సుమారు 8 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు విస్తరించి ఉన్నాయి. జీడి, మామిడి, పైనాపిల్, అరటి, కంది, అల్లం వంటి పంటలను కూడా ఏనుగులు ఎక్కువగా నాశనం చేస్తున్నాయి. ఈ సంవత్సరం జీడి పంట పెద్దగా లేకపోవడంతో అరటి, పైనాపిల్ పంటలకు నష్టం చేకూర్చాయి. పంటలు నాశనమైతే ప్రభుత్వం నుంచి అందే పరిహారం కూడా అంతంతమాత్రమేనని గిరిజన రైతులు వాపోతున్నారు.

పంటలన్నీ పోతున్నాయి..



ప్రతి ఏటా పంటలను ఏనుగులు నాశనం చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వేసుకుంటున్న పంటలన్నీ ఏనుగుల పరమైతే ఏం తింటాం. అప్పులు చేసి పంటలకు మదుపులు పెడుతున్నాం. తీరా పంట చేతికందే సరికి ఏనుగులు నాశనం చేస్తున్నాయి. – ఎస్.షోడంగ, చింతాడ

పరిహారం లేదు



ఏనుగులు నాశనం చేసిన పంటలకు ఎటువంటి నష్ట పరిహారం ఇవ్వడం లేదు. ప్రతి ఏటా ఇదే జరుగుతోంది. వ్యవసాయం చేయాలో.. వద్దో అర్థం కావడం లేదు. ఎప్పటి నుంచో సమస్య ఉన్నప్పటికీ పరిష్కారం మాత్రం లభించడం లేదు.

– వి.చలపతి, మర్రిపాడు

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వేతనాలు పెంచాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్(సీహెచ్‌డబ్ల్యూ)లకు వేతనాలు పెంచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు చాలీ చాలని వేతనంతో అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.

ఆశ వర్కర్లతో సమానంగా గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గుర్తింపు లభించడం లేదని, తగిన వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు శ్రమదోపిడీ, అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన సమీకృత బాలికల వసతిగృహంలో (టైప్-4 కేజీబీవీ) తాత్కాలిక పద్ధతిలో పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఎంఈఓ డి.గౌరినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు వీరఘట్టం బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం నాగమణికి అందజేయాలని పేర్కొన్నారు. వీరఘట్టం, నడుకూరు గ్రామాలకు చెందిన 47 ఏళ్ల లోపున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీకి చెందిన వారు.. 42 ఏళ్లలోపున్న ఇతర సామాజిక వర్గాల వారు అర్హులన్నారు.

పోస్టు వివరాలు	అర్హతలు
వార్డెన్- 1	బ్యాచ్‌లర్ డిగ్రీతో పాటు బీఈడీ లేదా ఎంఏ ఎడ్యుకేషన్
పార్ట్ టైం టీచర్- 1	బ్యాచ్‌లర్ డిగ్రీ (బీఎస్సీ మ్యాథ్స్)తో పాటు బీఈడీ లేదా ఎం.ఏ ఎడ్యుకేషన్
హెడ్ కుక్ - 1	ఎటువంటి విద్యార్హత లేదు
అసిస్టెంట్ కుక్ - 2	ఎటువంటి విద్యార్హత లేదు
చౌకీదార్ - 1	7వ తరగతి పాసై ఉండాలి

సీతంపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



సీతంపేట: తిరంగా ర్యాలీ చేస్తున్న సిబ్బంది



మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

సీతంపేట: మండల కేంద్రంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పార్క్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యం, కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భామినిలో..

భామిని: మండల కేంద్రంలో అధికారులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శివన్నారాయణ, ఎంపీడీఓ వసంతకుమారి, ఎంఈఓ శ్రీనివాస్, ఏపీఎం మీసాల చక్రపాణి ఆధ్వర్యంలో ర్యాలీ చేట్టారు.కార్యక్రమంలో కుట్టు శిక్షణ కేంద్రం మహిళలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులు జాతీయ జెండాలు చేతబూని పాఠశాల నుంచి ర్యాలీ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు.ప్రిన్సిపాల్ ఏ.రజినీకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

భామిని: మండలంలోని సాలికిరిలో నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రంపా లలిత రమేష్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

ఉద్యమంలో భాగస్వాములు కావాలి

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఆస్తులను కాపాడుకునేందుకు సంస్థ పరిధిలో అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఏపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూర కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లులూ కంపెనీకి విజయవాడ నడిబొడ్డున గల ఆర్టీసీ స్థలం కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే స్థలం కేటాయిస్తూ ఇచ్చిన జీఓ 137 రద్దు చేయాలని కోరారు. కూటమి సర్కారు ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోవటం అన్యాయమన్నారు. సంఘ నాయకులు, ఉద్యోగులు మాట్లాడుతూ.. ఐఆర్, డీఏ ప్రకటించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విజయనగరం జోనల్ సభ్యుడు మాడుగుల వైకుంఠం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న 8 వేల ఉద్యోగాలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్, జేఎస్ చలం, కె.తవుడు, ఎ.కృష్ణ, టి.ధర్మాంబ, జి.మంగ, జి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



సీతంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

జియ్యమ్మవలస: విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చినమేరంగి సీఐ టి.వి.తిరుపతిరావు సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ మండలంలోని చినమే రంగి,పెదమేరంగిలో చినమేరంగి ఎస్ఐ అనీష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అలాగే దొంగతనాలు,సారా విక్రయాలు చేసి పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మానవహారంగా ఏర్పాటయ్యారు.చినమేరంగి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణ,అధ్యాపకులు వి.కె.జి. మహరాణా, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

గుమ్మలక్ష్మీపురం: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి అన్నారు. నిషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ఎల్విన్‌పేటలో విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ చేశారు. అనంతరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేటలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ హరి, విద్యార్థులు

సీతంపేటలో..

సీతంపేట: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై వై. అమ్మన్నరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. నిషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కురుపాం మండల కేంద్రంలో యువత, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను ఎస్ఐ వివరించారు. కురుపాం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వీరఘట్టం: చేయి చేయి కలుపుదాం.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్సై జి. కళాధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పలు విద్యా సంస్థల విద్యార్థులతో బుధవారం స్థానిక ప్రధాన రహదారిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం సహకరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

తక్కువ ధరకే నిత్యావసర సరుకులు



తాడికొండ రేషన్ డిపోలో రికార్డులు పరిశీలిస్తున్న జీసీసీ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లోని రేషన్ డిపోల్లో మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుతున్నామని ప్రజలంతా సద్వినియోగించుకోవా లని జీసీసీ జనరల్ మేనేజర్ బి.సూర్యనారాయణ సూచించారు. పార్వతీపురం జీసీసీ డివిజన్ పరిధిలోని కురుపాం మండల కేంద్రం, గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంతో పాటు దుడ్డుఖల్లు, తాడికొండ గ్రామాల్లోని జీసీసీ స్టాక్ పాయింట్లతో పాటు రేషన్ డిపోలను బుధవారం ఆయన పరిశీలించారు. అలాగే గుమ్మలక్ష్మీపురం బ్రాంచ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25లో జీసీసీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు సమీపంలోని సంతల్లో, బహిరంగ మార్కెట్లో విక్రయించే నిత్యావసర సరుకులను అధిక ధరలకు కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారని, అంతే కాకుండా ఆ వస్తువుల్లో నాణ్యత కొరవడుతున్నప్పటికీ అవే వాడాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో నాణ్యమైన వస్తువులను ఎమ్మార్పీ కంటే తక్కువకే అందజేసేందుకు రేషన్ డిపోల వద్ద నిత్యావసర సరుకుల అమ్మకాలు విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకుల పంపిణీతో పాటు డిపోల వద్ద నిత్యావసర సరుకులు కూడా విక్రయిస్తామని, 16 నుంచి 30వ తేదీ వరకు కేవలం నిత్యావసర వస్తువులను మాత్రమే విక్రయిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.24 కోట్లతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.ఈయన వెంట జీసీసీ డీఎం జే.రామారావు, బ్రాంచ్ మేనేజర్‌లు ఎస్.రాము, ఎం.సాంబశివరావు, తదితరులున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పి.రమేష్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని ఉల్లిభద్ర పరిసరాల్లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన కళాశాల లో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులంతా తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలు పడే అవకాశం ఉందో వివరించారు. కొత్తగా చేరిన విద్యార్థులతో సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. డ్రగ్స్, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ రాజ్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరంతర నిఘా



చినమేరంగిలో సారా తయారీపై స్థానికులను విచారిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి గ్రామ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలను నిరోధించేందుకు నవోదయం 2.0లో భాగంగా నిరంతరం నిఘా ఉంచామని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. చినమేరంగిలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలో సారా తయారీ, విక్రయాలపై స్థానికులను విచారించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చినమేరంగి గ్రామ పరిధిలో నిఘా నిమిత్తం 24 గంటలూ పనిచేసేందుకు నలుగురు కానిస్టేబుళ్లను నియమించామని పేర్కొన్నారు. సారా కేసులో పట్టుబడిన పలువురిని ఆయా మండలాల తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేసి ఇప్పటి వరకు రూ.1.20 లక్షల వరకు అపరాధ రుసుం విధించామని చెప్పారు.ఎక్కడైనా సారా తయారీ, విక్రయాలు జరిగితే 63029 36599 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీఏసీఎస్ సీఈఓ రాజు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)లో సభ్యులకు జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు పీఏసీఎస్ సీఈఓ ఎస్.పి.రాజు సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. సహకార సంఘ సభ్యులకు సహకార చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రతీ సభ్యుడు నిబంధనలు తెలుసుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సీతంపేట: మండల కేంద్రంలో ఉన్న పలు ఎరువుల దుకాణాలను తహసీల్దార్ డి.శ్రీకన్య, వ్యవసాయాధికారి వాహిని బుధవారం తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీకే ఎరువులు విక్రయించడంతో పాటు రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



గరుగుబిల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గరుగుబిల్లి: ప్రతీ ఆరోగ్య కార్యక్రమంపై వైద్య సిబ్బంది దృష్టి పెట్టాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంఅండ్ హెచ్‌ఓ) డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. గరుగుబిల్లి, గొట్టివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం ఆయన తనిఖీలు చేశారు.ఆస్పత్రుల్లో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకుని,సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓపీ నమోదు, ఇతర రికార్డులను పరిశీలించారు. పీఎంజేఏవై, పీఎంఏఏవై, ఎన్‌సీడీ సీడీ ఎనీమియా యాక్షన్ కమిటీలతో చర్చించారు. వైద్య సిబ్బంది అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ రోగులకు సక్రమంగా వైద్యసేవలందించాలని, గర్భిణులు, శిశువుల్లో అనారోగ్య లక్షణాలను సకాలంలో గుర్తించాలని, ఫలితంగా ప్రమాదకర స్థితికి చేరకుండా జాగ్రత పడవచ్చన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గొట్టివలస గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, వైద్యాధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్, సూపర్‌వైజర్లు జగదీశ్వరి, ఉదయ్‌కుమారి ఉన్నారు.

అవగాహన సదస్సు

భామిని: మండలంలోని బత్తిలి కో ఆపరేటివ్ సొసైటీలో 'సమాచార హక్కు చట్టం - 2005'పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీ పరిధిలోని ప్రతీ సమాచారం ఆర్‌టీఐ ద్వారా పొందవచ్చని సొసైటీ సెక్రటరీ సనపల సుదర్శనరావు తెలిపారు. ఆర్‌టీఐ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో సిబ్బంది తిరుపతిరావు, వెంకీ వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.